
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం । 17 । జూన్ । 2023



చిన్నారి పెళ్లికూతుళ్లు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అవగాహన లోపంతో ఇప్పటికీ అక్కడక్కడ జరుగుతున్న బాల్య వివాహాలకు అధికారులు అడ్డుకట్ట వేస్తున్నారు. - 8లో ▸



డెల్టాలకు 6,135 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 1,700, మధ్య డెల్టాకు 1,225, పశ్చిమ డెల్టాకు 3,210 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.

గరిష్టం/కనిష్టం
48.5° / 28.1°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	48.5	29.5
కాకినాడ	43.9	28.1
అమలాపురం	46.0	30.0

న్యూస్‌రీల్

ముందస్తు ఖరీఫ్‌పై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ధ్యానచంద్ర

అమలాపురం రూరల్: ఖరీఫ్ ముందస్తు సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, వారికి కావలసిన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేయాలని వ్యవసాయ అధికారులను జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు మాట్లాడుతూ, జిల్లాలోని రైతుభరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. గత నెల సమావేశంలో చేసిన తీర్మానాలపై తీసుకున్న చర్యలను మండలాల వారీగా వివరించారు.

మూడు మండలాలకు ఎంఈఓల నియామకం

రాయవరం: జిల్లాలోని మూడు మండలాలకు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను పూర్తి అదనపు బాధ్యతలతో (ఎఫ్ఏసీ) ఎంఈఓలుగా నియమించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ జి.నాగమణి శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆలమూరు ఎంఈఓగా పని చేసిన డి.మురళీ సత్యనారాయణ బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఆలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.రామకృష్ణమూర్తికి ఎంఈఓ(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు అప్పగించారు. అలాగే రాయవరం ఎంఈఓగా విధులు నిర్వర్తించిన వై.సత్యనారాయణ బదిలీ కావడంతో ఆయన స్థానంలో రామచంద్రపురం ఎస్‌కేపీజీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం కె.వివేకానందను ఎంఈఓ(ఎఫ్ఏసీ)గా నియమించారు. సఖినేటిపల్లి ఎంఈఓ(ఎఫ్ఏసీ)గా పనిచేస్తున్న ఎన్.మనోహర్ స్థానంలో పల్లిపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం డి.కిషోర్‌కుమార్‌కు ఎంఈఓ(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు అప్పగించారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

అమలాపురం రూరల్: జగనన్నకు చెబుదాం అర్జీలను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించేందుకు ఈ నెల 23 నుంచి చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని క్షేత్ర స్థాయి అధికారులను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశించారు. జేసీ ధ్యానచంద్ర మండల అధికారులతో కలెక్టరేట్ నుంచి శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ తన క్యాంపు కార్యాలయం నుంచి పాల్గొన్నారు. అర్జీలు పరిష్కారం కాని వారి ఇళ్లకు రెండు రోజులు ముందుగానే వలంటీర్లు వెళ్లి, ఎందుకు పరిష్కారం కాలేదో వివరణ ఇవ్వాలని సూచించారు. 23న వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మండలాల పర్యవేక్షణ అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి తమకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు తక్షణం జారీ చేయాలన్నారు. జిల్లాలో జగనన్న ఇళ్లకు విద్యుత్, తాగునీరు వంటి సదుపాయాలు పూర్తి స్థాయిలో వచ్చాయో లేదో పర్యవేక్షించాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను జేసీ ధ్యానచంద్ర ఆదేశించారు.

వదలని వేసవి

- కానరాని 'నైరుతి'
- మండిపోతున్న మార్తాండుడు
- రెండున్నర నెలలుగా ఇదే పరిస్థితి
- రాజమహేంద్రవరంలో మరోసారి 48.5 డిగ్రీలు
- 30 ఏళ్లలో 6 డిగ్రీల మేర పెరిగిన ఉష్ణోగ్రతలు

సాక్షి, అమలాపురం: ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సకాలంలో వస్తాయన్న వాతావరణ శాఖ అంచనాలు తప్పాయి. జూన్ నెల సగం రోజులు గడిచిపోయినా నైరుతి జాడ కనిపించడం లేదు. వాతావరణంలో ఎల్‌నినో ప్రభావంతో ఆలస్యమైన రుతుపవనాలకు అరేబియా సముద్రంలో ఏర్పడిన బిపర్‌జోయ్ తుపాను మరింత బ్రేకులు వేసింది. ఈ తుపాను గాలిలో తేమను పశ్చిమ తీరం వైపు తీసుకువెళ్లిపోవడంతో రుతుపవనాల కదలిక ఆగిపోయింది. రాష్ట్రంలో శ్రీహరికోట, నెల్లూరు వద్ద నైరుతి జాడ కనిపించి వారం రోజులు దాటుతున్నా అక్కడి నుంచి రుతుపవనాలు ముందుకు కదలడం లేదు. దీనివల్ల నింగిలో మబ్బులు దోబూచులాడుతున్నా చుక్క వర్షం కురవడం లేదు. మే నెల మూడో వారం, రోహిణీ కార్తెల్లో అడపాదడపా వర్షాలు కురిశాయి కానీ ప్రస్తుత మృగశిర కార్తెలో మాత్రం చినుకు జాడే లేకుండా పోయింది. ఇదే సమయంలో సూర్యుడు ఉగ్రరూపం దాల్చాడు. మే నెలలో కన్నా జూన్‌లో క్రమం తప్పకుండా ప్రతి రోజూ విస్ఫులింగాలు వెదజల్లుతున్నాడు. వాస్తవానికి ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారం నుంచే ఎండలు మండుతూండటంతో ఈ వేసవి సుదీర్ఘమైనదిగా నమోదవుతోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాజమహేంద్రవరంలో మే 15న రికార్డు స్థాయిలో 48.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగత నమోదు కాగా.. శుక్రవారం మరోసారి అదే స్థాయిలో 48.5 డిగ్రీలు నమోదైంది. కాకినాడలో 43.9, అమలాపురంలో 42 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సైతం అధికంగానే ఉన్నాయి. రాజమహేంద్రవరంలో 29.5, కాకినాడలో 28.1 అమలాపురంలో 30 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. పగలు చండ్రనిప్పులతో సూర్యుడు చెలరేగిపోతున్నాడు. వడగాడ్పులతో సామాన్యులు అల్లాడిపోతున్నారు. ఉదయం పది గంటలు దాటితే రోడ్డు మీదకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. సాయంత్రం ఐదు గంటలైనా వేడి గాలులు తగ్గకపోవడంతో ఆపసోపాలు పడుతున్నారు.

ఉష్ణతాపానికి కారణాలివీ..

- అడవులు నరికివేయడం ఒక్కటే కాదు.. పెద్దపెద్ద నగరాలతో పాటు పట్టణాలు, పల్లెలు కూడా కాంక్రీట్ జంగిల్‌లా మారిపోతున్నాయి.
- ఏసీల వాడకం గణనీయంగా పెరిగింది. గడచిన నాలుగేళ్లలో ఏసీల వినియోగం మూడు రెట్లు పెరిగిందని అంచనా.

ఐదు దశాబ్దాలుగా సగటు ఉష్ణోగ్రతల పెరుగుదల (డిగ్రీల సెల్సియస్‌లో)

సంవత్సరం	ఉష్ణోగ్రత	సంవత్సరం	ఉష్ణోగ్రత
1970	39	2000	41
1980	40	2010	42
1990	39	2020	45

- విద్యుత్ వినియోగం వల్ల కూడా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.
- మోటార్ వాహనాల నుంచి వచ్చే కార్బన్‌డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, నైట్రస్ ఆక్సైడ్ ఎక్కువగా విడుదలవవుతూండటం వల్ల వాతావరణం వేడెక్కుతోంది.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పచ్చని వాతావరణం వల్ల ఒకప్పుడు మిగిలిన ప్రాంతాల కన్నా ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండేవి. చమురు సంస్థల కార్యకలాపాలు, నిరంతరం మండుతున్న గ్యాస్ వల్ల కోనసీమ సైతం అగ్నిగుండంగా మారిపోతోంది.

ఆహార దిగుబడులపై ప్రభావం

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు పర్యావరణంపై రకరకాలుగా దుష్ప్రభావం చూపుతున్నాయి.
- ముఖ్యంగా ఆహార దిగుబడిపై ప్రభావం పడుతోందని వ్యవసాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో పొత్తులు దెబ్బ తిని దిగుబడి తగ్గుతోంది.
- వరుసగా పది రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతూండటంతో భూములు తడారిపోయి, బీటలు వారుతున్నాయి. గోదావరి డెల్టాలో ఖరీఫ్ వరి చేలకు కాలువల ద్వారా నీరు అందిస్తున్నా.. ఎండలకు నారుమడి దెబ్బ తింటుందని రైతులు చెబుతున్నారు. దీంతో దమ్ములు చేసే ధైర్యం లేక సాగుకు వెనుకాడుతున్నారు. కడియం నర్సరీల్లో మొక్కలు వాడిపోతున్నాయి.

పెరుగుతున్న సగటు ఉష్ణోగ్రతలు



గతంతో పోల్చుకుంటే ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. గడచిన 50 ఏళ్లలో సగటు ఉష్ణోగ్రతలు ఆరు డిగ్రీల చొప్పున పెరిగాయి. 1970 నుంచి 2010 వరకూ ప్రతి దశాబ్దానికి ఒకటి రెండు డిగ్రీల ఉష్ణోగ్రతలు మాత్రమే పెరగడం, తగ్గడం జరిగేది. కానీ 2010 నుంచి 2020 మధ్యన సగటు ఉష్ణోగ్రతలు మూడు డిగ్రీల మేర పెరిగాయి. ఐదు దశాబ్దాల కిందట గాలిలో కార్బన్ డయాక్సైడ్ 280 పీపీఎం ఉండగా, ఇప్పుడది 415 పీపీఎంకు పెరిగింది. ఇది చాలా ప్రమాదకరం. మొక్కలను పెంచడం ద్వారా మాత్రమే ఉష్ణోగ్రతలను తగ్గించవచ్చు.

– డాక్టర్ పెన్నెట్టి కృష్ణకిషోర్, కోనసీమ కాలుష్య అధ్యయనకర్త, ప్రిన్సిపాల్, ఎస్‌కేబీఆర్ పీజీ కాలేజీ, అమలాపురం



దోబూచులాడుతున్న మబ్బులు : అమలాపురంలో 216 జాతీయ రహదారి వద్ద..



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా మారిన అమలాపురం - ముక్కామల బైపాస్ రోడ్డు

యువ ఓటర్ల శాతం పెంపునకు చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: జిల్లాలో యువ ఓటర్ల శాతం పెరిగే విధంగా కళాశాలల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఓటర్ల జాబితా నమోదు, సవరణ తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టర్ శుక్లా, జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 2023 అంచనాల ప్రకారం జిల్లాలో 20,07,570 జనాభా ఉందన్నారు. వీరిలో పురుషులు 10,07,030 మంది, మహిళలు 10,00,540 మంది ఉన్నారని తెలిపారు. జిల్లా జనాభాలో పురుష ఓటర్లు 7,39,795 మంది మహిళా ఓటర్లు 7,44,665 మంది, ఇతరులు 25 మంది కలిపి మొత్తం 14,84,485 మంది, సర్వీస్ ఓటర్లు 803 మంది ఉన్నారని వివరించారు. ఫామ్-6 ప్రకారం ఏప్రిల్ 15 నుంచి ఈ నెల 14 వరకూ 7,267 దరఖాస్తుల స్వీకరించామని, 5,377 ఆమోదించామని, 863 తిరస్కరించామని, 1,027 పెండింగులో ఉన్నాయని వివరించారు. అలాగే, ఫామ్-7 ప్రకారం 2,658 దరఖాస్తులు వచ్చాయని, 1,761 ఆమోదించామని తెలిపారు. జిల్లాలో 100 సంవత్సరాలు పైబడిన ఓటర్లు 169 మంది ఉన్నారన్నారు. ఒకే ఇంట్లో పది మంది ఓటర్లున్నవి జిల్లాలో 5,519 మంది ఉన్నాయని, దీనిపై నివేదికలు తీసుకుంటున్నామని కలెక్టర్ శుక్లా తెలిపారు.

గౌరవ వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఆదాయం లేని మసీదుల ఇమామ్‌లు, మౌజన్లు ప్రభుత్వం మంజూరు చేస్తున్న గౌరవ వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అర్హులైన ఇమామ్‌లకు రూ.10 వేలు, మౌజన్లకు రూ.5 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. దీనికోసం మసీదు పేరిట బ్యాంక్ అకౌంట్ పాస్ పుస్తకం, ఇమామ్, మౌజన్ల బ్యాంక్ అకౌంట్ జిరాక్సు కాపీలు, మసీదు అధ్యక్షుడు, ఇమామ్, మౌజన్ల పాస్‌పోర్టు సైజు ఫొటోలు, మసీదు పేరిట పాన్‌కార్డు, సెల్‌ఫోన్ నంబర్లు, మసీదు స్థల డాక్యుమెంట్ల జిరాక్సు కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. మసీదు డాక్యుమెంట్లు లేకుంటే మసీదు పేరు, హద్దులతో సర్వే నంబర్లు, విస్తీర్ణంతో గ్రామ కమిటీ ధ్రువీకరణ పత్రాన్ని జత చేసి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ మహ్మద్ షఫీవుల్లా సూచించారు. దరఖాస్తులను కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా వక్ఫ్ బోర్డు కార్యాలయంలో సమర్పించాలని ఖాదర్ తెలిపారు. వివరాలకు 9490 123 786, 99 660 666 88 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చదువుతో ఉన్నత శిఖరాలకు..

- విద్యార్థులతో మంత్రి విశ్వరూప్
- 'జగనన్న ఆణిముత్యాలు'కు సత్కారాలు



టెన్త్ నియోజకవర్గ టాపర్లను, వారి తల్లిదండ్రులను సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: ఏ రంగంలోనైనా మనిషిని ఉన్నత శిఖరాలకు తీసుకు వెళ్లేది చదువు మాత్రమేనని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో నియోజకవర్గ స్థాయి టాపర్లుగా నిలిచిన విద్యార్థులను 'జగనన్న ఆణిముత్యాలు' పేరిట స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా సత్కరించి, పతకాలు, నగదు పురస్కారాలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ, ఇప్పటికే నాడు–నేడు, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక వంటి పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే టెన్త్, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం నగదు అవార్డులు, పతకాలతో ప్రోత్సహించడం చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎం.కమలకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, అమలాపురం ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, ఉప్పలగుప్తం, అల్లవరం జెడ్పీటీసీ సభ్యులు గెడ్డం సంపదరావు, కొనుకు గౌతమి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులతో పాటు వారు ఉత్తమ మార్కులు సాధించేలా తీర్చిదిద్దిన డీఈఓ కమలకుమారి, ఎంఈఓలు జి.సూర్యప్రకాస్, కిరణ్‌బాబు, అమలాపురం, భీమనపల్లి, బండార్లంక జెడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎస్.రాజరాజేశ్వరి, నూకల సత్యనారాయణ, ఎస్ఎల్‌వీ బాల, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. అలాగే అమలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కవల కోటిలింగం, గోడి సోషల్ వెల్ఫేర్ హాస్టల్ ప్రిన్సిపాల్ ప్రేమప్రసాద్‌లను కూడా సన్మానించారు. సభలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తదితరులు పాల్గొన్నారు.

వీరే 'ఆణిముత్యాలు'

అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థిని దంగేటి చైతన్య సత్యపద్మిని 584 మార్కులతో టెన్త్‌లో నియోజకవర్గ టాపర్‌గా నిలిచింది. ఆమెకు రూ.15 వేల నగదు పురస్కారం, స్వర్ణ పతకం బహూకరించారు. అలాగే భీమనపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎం.వీరదుర్గా శ్రావ్య 582 మార్కులతో నియోజకవర్గ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆమెకు రూ.10 వేల నగదు బహుమతి, రజత పతకం అందించారు. 581 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన బండార్లంక జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని సీహెచ్ దేవీ నాగశ్రీకి రూ.5 వేల నగదు బహుమతి, కాంస్య పతకం ప్రదానం చేశారు. ఇంటర్మీడియెట్‌కు సంబంధించి అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని జి.జ్యోతిస్రవంతి రూ.15 వేలు, పి.హర్షిత రూ.15 వేలు, పి.లక్ష్మీ లావణ్య రూ.15 వేలు, అల్లవరం మండలం గోడి సోషల్ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థిని పి.లక్ష్మీ లావణ్య రూ.15 వేల చొప్పున నగదు అవార్డులు అందుకున్నారు.

కొబ్బరి వ్యాపారానికి.. కొత్త రెక్కలు



- ఎండ గండం నుంచి రక్షణకు బొండాలను ఆశ్రయిస్తున్న జనం
- వేసవితో పెరిగిన వినియోగం
- జోరుగా ఎగుమతులు
- రోజుకు 10 లక్షలకు పైగా ఇతర ప్రాంతాలకు రవాణా
- కాయ కంటే బొండానికే అధిక ధర

మలికిపురం: రోహిణీ ముగిసి, మృగశిర కార్తె వచ్చినా.. సూర్యుడు ఎక్కడా 'తగ్గేదే.. లే..' అంటున్నాడు. నింగి నుంచి నిప్పుల వాన కురిపిస్తూనే ఉన్నాడు. వాస్తవానికి రోహిణీ కార్తెకు దాదాపు నెల రోజుల ముందు నుంచే 40 డిగ్రీల సెల్సియస్ పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతూనే ఉన్నాయి. ఈ వేసవి సుదీర్ఘంగా ఉండటంతో ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. సరిగ్గా ఇదే తరుణంలో కొబ్బరి వ్యాపారం కొత్త రెక్కలు తొడుక్కుంది. ఇప్పటి వరకూ రకరకాల కొబ్బరి ఉత్పత్తుల రవాణా జరుగుతూండగా.. తాజాగా వేసవి ప్రభావంతో బొండాల ఎగుమతులు జోరందుకున్నాయి.

అపోహ వీడి..

కొంత కాలం నుంచి కొబ్బరి బొండాల వ్యాపారం సాగుతున్నప్పటికీ అందులో పెద్దగా పురోగతి లేదు. బొండాలు దించితే చెట్టుపై దుష్ప్రభావం పడుతుందనే రైతుల అపోహ ఇందుకు కారణం. ఫలితంగా మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్నప్పటికీ కొబ్బరి బొండాల వ్యాపారం అంతంత మాత్రంగానే సాగుతూండేది. అయితే ప్రస్తుతం కొబ్బరి కాయ ఎగుమతులు సన్నగిల్లడం, పాటు ధరలో స్థిరత్వం లేకపోవడం వంటి కారణాలతో రైతులు కూడా తమ ఆలోచనను మార్చుకున్నారు. కొబ్బరి కాయ కంటే బొండం ధర అధికంగా ఉండటంతో ప్రస్తుతం గోదావరి జిల్లాల్లో కొబ్బరి బొండాల వ్యాపారం జోరుగా జరుగుతోంది. దీనికితోడు ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు విపరీతంగా ఉండటం వలన కూడా బొండాలకు డిమాండ్ బాగా పెరిగింది. దీంతో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని రైతులు కొబ్బరి బొండాలను చెట్ల నుంచి దించుతున్నారు. వ్యాపారులు జోరుగా ఎగుమతులు చేస్తున్నారు. జిల్లాలోని రాజోలు దీవితో పాటు పి.గన్నవరం లంకలు, రావులపాలెం, ఆత్రేయపురంతో పాటు తూర్పు గోదావరి జిల్లా కడియం, కాకినాడ జిల్లా తుని, పశ్చిమ గోదావరి జిల్లా నుంచి కొబ్బరి బొండాల ఎగుమతులు విస్తృతంగా జరుగుతున్నాయి.



కోనసీమ నుంచి ఎగుమతి అవుతున్న కొబ్బరి బొండాలు



వెంటనే డబ్బులు

ప్రస్తుతం కొబ్బరి కాయ రైతు ధర రూ.7 వరకూ ఉంది. దీనికి దింపు, రవాణా ఖర్చులు అదనం. అదే ఒక్కో బొండానికి సైజును బట్టి రూ.9 నుంచి రూ.11 వరకూ రైతుకు దక్కుతోంది. దింపు, రవాణా ఖర్చులను వ్యాపారులే భరిస్తున్నారు. పైగా చెల్లింపులు కూడా జరుగుతూండటంతో రైతుల చేతిలో వెంటనే డబ్బులు పడుతున్నాయి. బొండాలు దించితే గెలకు సాధారణ కొబ్బరి కాయల కంటే అధికంగా దిగుబడి వస్తుంది. అదే కాయలైతే ఎలుకలు, దెయ్యపు తొట్లు, ఎండలకు రాలిపోవడం వంటి నష్టాలతో దిగుబడి తగ్గుతుంది. దీనిని కూడా బేరీజు వేసుకుంటున్న రైతులు ఈ సీజన్‌లో బొండాల దింపుపై మొగ్గు చూపుతున్నారు. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరితో పాటు విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్నం వంటి నగరాలకు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు బొండాల ఎగుమతులు జోరుగా జరుగుతున్నాయి. గోదావరి జిల్లాల నుంచి ప్రతి రోజూ 10 లక్షలకు పైగా బొండాలు ఎగుమతి అవుతున్నాయని అంచనా. వీటి ధర స్థానికంగా రూ.1.20 కోట్ల వరకూ ఉంది. రవాణాతో కలిపి ఇతర ప్రాంతాల్లో విక్రయించడం ద్వారా రోజుకు రూ.2 కోట్లకు పైగా టర్నోవర్ జరుగుతోందని చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 50 శాతం అధికమని వ్యాపారులు అంటున్నారు.

కొబ్బరి నీళ్లతో ఆరోగ్యం



సాధారణ శీతల పానీయాల కంటే కొబ్బరి నీరు ఆరోగ్యానికి చాలా మంచిది. వేసవితో పాటు ఏ కాలంలోనైనా తరచూ తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. కొబ్బరి నీటిలోని సహజసిద్ధ పోషకాలు మనిషి గుండె ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. రక్తంలో మంచి కొలెస్ట్రాల్‌ను పెంచి చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తాయి. కొబ్బరి నీరు గ్రీష్మ తాపం నుంచి శరీరాన్ని కాపాడుతుంది.

– డాక్టర్ దుర్గాప్రసాద్, వైద్యాధికారి, లక్కవరం

బొండాలు దింపడం మంచిదే



కొబ్బరి బొండాలు దింపడం మంచిదే. దీనిపై రైతులు అపోహ పడవద్దు. కొబ్బరి తోటలను ప్రత్యేకంగా బొండాల దిగుబడి తోటలుగా మార్చుకోవచ్చు. ఆదాయ వనరుగా మలచుకోవచ్చు.

– దిలీప్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి

ఎగుమతులు పెరిగాయి



గతం కంటే ఈ ఏడాది కొబ్బరి బొండాల ఎగుమతులు పెరిగాయి. ఎండల తీవ్రతతో పాటు, వైద్యులు కూడా కొబ్బరి బొండాలను సిఫారసు చేయడంతో ఈ డిమాండ్ ఏర్పడింది. గతంతో పోలిస్తే రైతులు కూడా చెట్ల నుంచి బొండాలు దించేందుకు మొగ్గ చూపుతున్నారు.

– శిరిగినీడి రామకృష్ణ, బొండాల ఎగుమతిదారు, రాజోలు మధ్య లంక

క్లుప్తంగా

గుడ్డిగూడెం వద్ద 'పుష్ప-2'



పోలవరం కుడి ప్రధాన కాలువలో చిత్రీకరిస్తున్న ఎర్రచందనం దుంగల అక్రమ రవాణా సన్నివేశం

దేవరపల్లి: తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం గుడ్డిగూడెం వద్ద సినిమా షూటింగ్ సందడి నెలకొంది. సుకుమార్ దర్శకత్వంలో స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా నిర్మిస్తున్న 'పుష్ప-2' సినిమా షూటింగ్ మూడు రోజులుగా ఇక్కడ జరుగుతోంది. చిత్రంలోని పలు కీలక సన్నివేశాలను ఇక్కడ తీస్తున్నారు.

ముఖ్యంగా పోలవరం కుడి ప్రధాన కాలువలో ఎర్రచందనం స్మగ్లింగ్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్నారు. ఈ గ్రామం పోలవరానికి సమీపంలో ఉండటంతో ఇక్కడ అటవీ ప్రాంతంతో పాటు అందమైన లొకేషన్లు ఉన్నాయి. దీంతో ఈ సినిమా షూటింగ్‌కు ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నారు.

కేరళ సహకార బ్యాంకును సందర్శించిన ఆకుల



కేరళ కో ఆపరేటివ్ ఎపెక్స్ బ్యాంకు వద్ద డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కేరళ రాష్ట్రంలోని కో ఆపరేటివ్ ఎపెక్స్ బ్యాంకును ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ ఆకుల వీర్రాజు, ఆప్కాబ్ చైర్మన్, ఇతర డీసీసీబీల చైర్మన్లు, అధికారులతో కలిసి శుక్రవారం సందర్శించారు. సొసైటీల అభివృద్ధికి కేరళ కో ఆపరేటివ్ ఎపెక్స్ బ్యాంకు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. ఆ విధానాన్ని మన రాష్ట్రంలోని సొసైటీల్లో అమలు చేసేందుకు ఆప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీరాణి ఆధ్వర్యాన చైర్మన్లు, అధికారులు కేరళ కో ఆపరేటివ్ ఎపెక్స్ బ్యాంక్ ఆహ్వానం మేరకు అక్కడకు వెళ్లి, అధ్యయనం చేశామని ఆకుల వీర్రాజు విలేకర్లకు తెలిపారు.

APS RTC
టెండరు ప్రకటన

చిన్నారి పెళ్లికూతుళ్లు



- పసి మొగ్గల భవితకు మూడు 'ముళ్లు'
- బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు
- గుట్టుచప్పుడు కాకుండా అక్కడక్కడ పెళ్లిళ్లు
- అవగాహన కల్పిస్తున్న అధికారులు
- ఉమ్మడి జిల్లాలో నాలుగున్నరేళ్లుగా 436 వివాహాలకు అడ్డుకట్ట

నాలుగున్నరేళ్లుగా ఉమ్మడి జిల్లాలో నిలిపిన బాల్య వివాహాలు

సంవత్సరం	గుర్తించినవి	నిలిపినవి
2019	149	149
2020	107	107
2021	34	34
2022	89	89
2023 (ఇప్పటి వరకూ)	57	57

రాయవరం: ఓపక్క పెళ్లి బాజాలు మోగుతున్నాయి. వధూవరులు మండపానికి వచ్చేశారు. ఇంకోపక్క బంధువులందరూ విందు భోజనాలు చేస్తున్నారు. ఎవరు సమాచారం ఇచ్చారో కానీ.. ఐసీడీఎస్, పోలీసు, రెవెన్యూ అధికారులు పెళ్లి మండపానికి వచ్చారు. పెళ్లి కుమార్తెకు 18 ఏళ్లు నిండలేదని, బాల్య వివాహ చట్టం ప్రకారం ఈ వివాహం నేరమని తల్లిదండ్రులకు వివరించారు. దీనివలన కలిగే అనర్థాలను వివరించి, వివాహాన్ని ఆపాలని సూచించారు. ఇక్కడి వరకూ వచ్చాక ఇప్పుడు పెళ్లి ఎలా ఆపుతామంటూ అధికారులతో చిన్నారి పెళ్లికూతురి తల్లిదండ్రులు, బంధువులు వాగ్వాదానికి దిగారు. చివరకు అధికారుల జోక్యంతో ఆ బాల్య వివాహానికి బ్రేక్ పడింది. ఇటువంటి సంఘటనలు ఇప్పటికీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా అడపాదడపా కనిపిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా కోరుకొండ, ఆత్రేయపురం, పెద్దాపురం, పెదపూడి, శంఖవరం, కాట్రేనికోన, రాజోలు, పి.గన్నవరం, కొత్తపేట తదితర మండలాల్లో బాల్య వివాహాలు అధికంగా జరుగుతున్నట్టు చైల్డ్‌లైన్‌కు వస్తున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.

ఎన్నో అనర్థాలు

తల్లిదండ్రుల్లో అవగాహనా లోపం, సామాజిక పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, ప్రేమ వ్యవహారాలు, దగ్గరి బంధుత్వాల వంటి కారణాలతోనే ఇప్పటికీ కొన్నిచోట్ల బాల్య వివాహాలు జరుగుతున్నాయని అధికారులు గుర్తించారు. ఎదిగీ ఎదగని వయస్సులో చిన్నారుల మెడలో పడే మూడు ముళ్లు ఎన్నో పీటముడులకు కారణమవుతాయి. పద్దెనిమిదేళ్లలోపు వయసులో పెళ్లయితే పుస్తకాలు పక్కన పెట్టి కుటుంబ బాధ్యతలు మోయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. పెన్ను పట్టాల్సిన చేయి వంటగదిలో గరిటె తిప్పాల్సి వస్తోంది. బాల్యంలోనే వివాహమైన అమ్మాయిలకు జీవితాంతం ఇబ్బందులు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో వారు తీవ్ర ఇబ్బందులు పడతారని, రోగాలు వెన్నాడే ప్రమాదముంటుందని గైనకాలజిస్టులు హెచ్చరిస్తున్నారు. చిన్న వయస్సులో వివాహాలు జరిగిన వారికి రక్తహీనత సమస్య తీవ్రంగా ఉంటుంది. పుట్టే బిడ్డల్లో ఎదుగుదల తక్కువగా ఉంటుంది. శారీరకంగా, మానసికంగా సమస్యలు ఎదురవుతాయి. ఎదగాల్సిన సమయంలో కడుపులో బిడ్డను మోయాల్సి రావడం ఆ బాలిక ఆరోగ్యంపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుంది.



బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

నిరంతర పర్యవేక్షణతో..

ప్రభుత్వం బాలికా విద్యను ప్రోత్సహిస్తున్నా ఎక్కడో ఒకచోట అనర్థాలు జరిగిపోతూనే ఉన్నాయి. దీనిని అడ్డుకునేందుకు ఆయా జిల్లాల కలెక్టర్ల నేతృత్వంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. తల్లిదండ్రుల్లో చైతన్యం పెంచేందుకు ఎప్పటికప్పుడు కృషి చేస్తున్నారు. బాల్య వివాహాలను పూర్తిగా అరికట్టే లక్ష్యంతో పదో తరగతి పూర్తయిన తర్వాత ఆ బాలికలు ఇంటర్, ఇతరత్రా కోర్సుల్లో చేరారా, లేదా అనే విషయంపై విద్యా శాఖ కూడా దృష్టి సారిస్తోంది. అధికారుల నిరంతర పర్యవేక్షణతో బాల్య వివాహాలకు క్రమంగా అడ్డుకట్ట పడుతోంది. గడచిన ఐదేళ్లుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 436 బాల్య వివాహాలను స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు అడ్డుకున్నారు.

హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలి

బాల్య వివాహాలు నేరం. ఇవి జరిగితే క్షేత్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకూ ఎవ్వరికైనా సమాచారం ఇవ్వవచ్చు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్టు తెలిస్తే పోలీసులకు సంబంధించిన టోల్‌ఫ్రీ నంబర్ 100, చైల్డ్‌లైన్ 1098, హెల్ప్‌లైన్ 181 నంబర్లతో పాటు తహసీల్దార్, ఐసీడీఎస్ సీడీపీఓ, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి (జీఎంఎస్‌కే), వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లకు సమాచారం ఇవ్వవచ్చు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతారు.

నిరంతరం అవగాహన



బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులు, బాలల సంరక్షణ సమితి సిబ్బందితో ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు బాధ్యతగా ఉంటే పరిస్థితిలో స్పష్టమైన మార్పు వస్తుంది.

– గుత్తుల సత్యవాణి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి, అమలాపురం

అన్ని శాఖల సమన్వయంతో..



స్త్రీ, శిశు సంక్షేమం, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యాశాఖల సంయుక్త సహకారంతో మంచి ఫలితాలు వస్తాయి. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై విద్యార్థి దశ నుంచే విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాం. గతంతో పోలిస్తే ఇప్పుడు తల్లిదండ్రుల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.

– సీహెచ్ వెంకటరావు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి, కాకినాడ

చట్టాలు ఏం చెబుతున్నాయంటే..

1929లోనే బాల్య వివాహాల నిరోధక చట్టం తీసుకువచ్చారు. దీనిలో శిక్షలు తక్కువగా ఉండటంతో ఈ చట్టంలో మార్పులు, చేర్పులు చేసి 2006లో సంపూర్ణంగా అమలులోకి తీసుకువచ్చారు. 2007 నవంబర్ నుంచి దీని అమలు ప్రారంభమైంది. సమాజంలో యువతీ యువకులు యుక్త వయస్సు వచ్చాక వారి జీవిత భాగస్వాములను స్వేచ్ఛగా ఎంపిక చేసుకునే అవకాశం ఇవ్వాలని ఈ చట్టంలో పేర్కొన్నారు. అంతకన్నా తక్కువ వయసు ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు తప్పనిసరి చేశారు. దీనిని అతిక్రమిస్తే రెండేళ్ల జైలు, రూ.లక్ష వరకూ జరిమానా విధించే అవకాశముంది. బాల్య వివాహాలను ప్రోత్సహించే వారికి కూడా శిక్షలు తప్పవు.

హోటళ్లు, రెస్టారెంట్లపై విజిలెన్స్ దాడులు



గ్రీన్ ట్రీ హోటల్‌లో నిల్వ మాంసాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ డీఎస్పీ ముత్యాల నాయుడు, సీఐ సత్యకిషోర్

అమలాపురం టౌన్: పట్టణంలోని గ్రీన్ ట్రీ ఎన్వీ, శ్రీదేవి బార్ అండ్ రెస్టారెంట్లపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, తూనికలు – కొలతలు, ఫుడ్ కంట్రోల్, వార్డు సచివాలయాల పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులతో కూడిన అధికారుల బృందం శుక్రవారం ఆకస్మికంగా దాడులు చేసింది. విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ ఆధ్వర్యాన డీఎస్పీ ముత్యాల నాయుడు పర్యవేక్షణలో సీఐ వై.సత్యకిషోర్ ఈ దాడులు నిర్వహించారు. గ్రీన్ ట్రీ హోటల్‌లో ముందు రోజు మాంసాన్ని నిల్వ ఉంచడాన్ని గుర్తించారు. పారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నట్టు గమనించారు. నిల్వ మాంసాన్ని సీజ్ చేశారు. హోటల్‌లో ప్లాస్టిక్ కవర్లు ఎక్కువగా వాడుతున్నట్టు గుర్తించిన వార్డు సచివాలయ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శి బండి వీరన్న.. హోటల్ యాజమానికి రూ.7,500 జరిమానా విధించారు. అలాగే శ్రీదేవి బార్ అండ్ రెస్టారెంట్‌లో వేయింగ్ మెషీన్(కాటా)కు అధికారిక సీళ్లు లేకపోవడం, మద్యం పోసే పెగ్గులు సక్రమంగా లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. కాటా, పెగ్గులను సీజ్ చేశారు. రెస్టారెంట్‌లో ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉండటంతో పాటు కుకింగ్ రూమ్‌లో పరిశుభ్రత లేదని గుర్తించిన వార్డు సచివాలయ అధికారులు ఆ రెస్టారెంట్ యజమానికి రూ.15 వేల జరిమానా విధించారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏఓ భార్గవ్ మహేష్, ఫుడ్ అసిస్టెంట్ కంట్రోలర్ రాజేష్, తూనికలు – కొలతల అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. గ్రీన్ ట్రీ హోటల్, శ్రీదేవి బార్ అండ్ రెస్టారెంట్లపై కేసులు నమోదు చేశామని విజిలెన్స్ సీఐ సత్యకిషోర్ తెలిపారు.

ఇతర వాణిజ్య పంటల పైనా పరిశోధనలు చేపట్టాలి

- ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సింగ్
- సీటీఆర్ఐలో ముగిసిన పరిశోధన సలహా కమిటీ సమావేశాలు



సమావేశాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ హెచ్ఎస్ గుప్తా. చిత్రంలో డాక్టర్ ఆర్‌కే సింగ్ తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పొగాకుతో పాటు ముఖ్యమైన వాణిజ్య పంటలపై కూడా పరిశోధనలు చేపట్టాలని ఢిల్లీకి చెందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసీఏఆర్) కమర్షియల్ క్రాప్స్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఆర్‌కే సింగ్ శాస్త్రవేత్తలకు సూచించారు. రాజమహేంద్రవరంలోని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ(సీటీఆర్ఐ)లో పరిశోధన సలహా కమిటీ సమావేశాలు రెండు రోజుల పాటు నిర్వహించారు. రెండో రోజైన శుక్రవారం సీటీఆర్ఐ సెమినార్ హాలులో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, ఐసీఏఆర్ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ కమర్షియల్ అగ్రికల్చర్ (ఎన్ఐఆర్‌సీఏ) ద్వారా ఈ పరిశోధనలు సాగించాలన్నారు. పరిశోధన సలహా కమిటీ చైర్మన్‌గా న్యూఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా పని చేసి, అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్న శాస్త్రవేత్త డాక్టర్ హెచ్ఎస్ గుప్తా వ్యవహరిస్తున్నారు. ఈ కమిటీలో ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ కేవీ భట్, డాక్టర్ విలాస్ తోనపి, డాక్టర్ కేపీ పటేల్, డాక్టర్ సీహెచ్‌వీవీ సత్యనారాయణ, రైతులు పొట్లూరి రామ్మోహనరావు, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సభ్యులుగా ఉన్నారు. వీరందరూ ఈ సమావేశాల్లో పాల్గొన్నారు.

గత ఏడాది సీటీఆర్ఐ పరిశోధన స్థానాల ప్రాజెక్టులు, వాటి ఫలితాలు, పొగాకు సాగులో ఎదురవుతున్న సమస్యలు, నివారణ చర్యలు, పొగాకు ద్వారా అత్యున్నత ఆర్థిక ప్రగతి సాధనలో శాస్త్రవేత్తల కృషిని సీటీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ వివరించారు. పొగాకుతో పాటు పసుపు, మిరప, ఆముదం, అశ్వగంధ పంటలపై పరిశోధనలకు కార్యాచరణ ప్రణాళిక, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలతో సమన్వయం తదితర అంశాలను వివరించారు. అనంతరం సీటీఆర్ఐ ప్రాంతీయ పరిశోధన సంస్థల ప్రజెంటేషన్లను విభాగాలు వారీగా ప్రధాన శాస్త్రవేత్తలు సమర్పించారు. పరిశోధన పరిశీలన కమిటీ శాస్త్రవేత్తలకు అనేక సలహాలు ఇచ్చారు. కమిటీ చైర్మన్ డాక్టర్ గుప్తా మాట్లాడుతూ, శాస్త్రీయ పరిశోధనల్లో విప్లవాత్మక మార్పులను ఆహ్వానించాలని సూచించారు. పొగాకుతో పాటు పసుపు, మిరప, ఆముదం, అశ్వగంధ తదితర వాణిజ్య పంటలపై కూడా విస్తృత పరిశోధనలు చేపట్టాలని అన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE
■ పెద్దాపురం-సుధ కాలనీ 3BHK ఫ్లాట్ అమ్మకానికి కలదు. 1200Sft. రెడీ టు ఆక్యుపై, 30 లక్షలు మాత్రమే, కారు పార్కింగ్ సౌత్ ఫేసింగ్, 100% ఫైనాన్స్. ఫోన్: 9440303936 [HA-269]

PLOT FOR SALE
■ తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి మొరంపూడి జంక్షన్ ఈనాడు ఆఫీస్ వెనుక జనచైతన్య ఫ్లాట్ యందు ప్లాట్ నెం. 322, 209 చ॥గ॥ ప్లాట్ అమ్మకానికి కలదు. ఆసక్తి గలవారు. ఫోన్:8959111417 [H-780812]

TO-LET
■ రాజమండ్రి, JN రోడ్, షిర్డీ సాయి మార్గ్ రోడ్డులో డోర్ నెం.86-3-14/2లో సుమారుగా 2400Sft గల బిల్డింగ్ ఆఫీసులకు కమర్షియల్‌గా అద్దెకు కలదు. ✆ : 98481 41956 [R-4640]
■ Kakinada: Residential space (3 BHK) for rent in Kakinada. near 3 lights junction, Ramarao pet, with lift provision. Interested may first send a what's app message to ✆ : 92461 95304 / 81211 30200 [R-1831]

Services
■ బంగారము బ్యాంకులలో, ప్రైవేట్, ఫైనాన్స్‌లలో తనఖాలలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువు తోటి తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 S [R-5935]

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో ఉన్నవి ఈ రోజు ఆన్‌లైన్ ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ (100% జెన్యూన్) సంప్ర: ✆ 945 945 3338 [B-270]

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

Wanted
■ వేమగిరి, బొమ్మూరు, ధవళేశ్వరం పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ 8 Hrs. శాలరి 10,000/- సం॥ప్ర ✆ : 86392 52628 [R-1234176]
■ సాయి వేంకటేశ్వర MMA కో-ఆపరేటివ్ సొసైటీ నందు పనిచేయుటకు M/F ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. Qua: 10th ఆపైన, 2 వీలర్ ఆ॥ జీతం + ఇన్సెంటివ్ (కమీషన్) సంప్ర॥ 29-14-107, దేవీచౌక్, రాజమండ్రి. ✆ : 93931 75999 [R-4395]
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221314]
■ బ్యాంక్‌లలో (ఆఫీస్ వర్క్స్) పర్మినెంట్‌గా Q: 10th- డిగ్రీ జీ॥ 26,000/- కం॥ ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, అకౌంటెంట్స్, క్యాషియర్స్ @Ph: 83328 09093 [H-781443]
■ ఇంట్లో ఉంటూ వంట చేయుటకు ఆడ వంట మనిషి కావలెను. ఏరియా బోయిన్‌పల్లి, హైదరాబాద్ సంప్రదించు ఫోన్ : 7013046377. [HA-11242]
■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోవడానికి స్త్రీ/పు అర్జెంటుగా కావలెను ఆయా, వార్డ్‌బాయ్స్, నర్సులు, వంటవారు.RMP. Dr. Q.5th-Degree, 10-30 వేలు జీతం, భోజనం+రూం ఫ్రీ, Hyd. 7993583999 [HA-308]
■ శ్రీసాయిరాం హోమ్‌కేర్ Hydలో శ్రీమంతుల ఇండ్లలో ఇంటిపని వంటపని, వృద్ధులను, చిన్న పిల్లలను చూసు కొనుటకు స్త్రీ/పు.కావలెను. జీతం: 18000/- ఏజెంట్ కమీషన్ 7K 9888001826, 9888001827 [H-781440]
■ హరేకృష్ణ హోమ్‌కేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 [H-793444]
■ ప్రముఖ TV Channel నందు జిల్లాల వారీగా పనిచేయుటకు Reporters, Marketing Executives, Editiors, Anchors & Writers కావలెను. ఫోన్ : 80744 03993, 0883 – 3586270 [V- 794468]
■ హృదయాలయం మానసిక దివ్యాంగుల ఆశ్రమం తూర్పుగోదావరి జిల్లా, నిడదవోలు, శంకరాపురంలో జీతంకు పనిచేయుట సేవాభావం గల వంటవారు, సహాయకులు, వార్డెన్లు, ఆయాలు, డ్రైవర్ కావలెను. 94409 42148, 62817 04979. [P-549]
■ APSRTC నందు కాంట్రాక్ట్ ఉద్యోగుల కొరకు దరఖాస్తులు కోరడమైనది. రాజోలు, నర్సాపురం, రాజమండ్రి, రావులపాలెం, నిడదవోలు, (Welder) ఆయిల్ పంప్ బాయ్స్, AC Bus అటెండర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. PF & ESI కలదు. Contact : 73822 61616, 73822 51616 [R-1234179]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

జగ్గంపేట: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో గత ఫిబ్రవరిలో పట్టుబడిన గంజాయి కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఘంటసాల దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసినట్లు సీఐ సూర్య అప్పారావు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గత ఫిబ్రవరి 27న విశాఖపట్నం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు లారీలో తరలిస్తున్న గంజాయిని జగ్గంపేట మండలం రామవరంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కొంతమంది నిందితులను అప్పట్లో అరెస్టు చేశారు. వారికి 320 కిలోల గంజాయిని విక్రయించిన ఘంటసాల దుర్గాప్రసాద్ ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్నాడు. అప్పటి నుంచీ తప్పించుకుని తిరుగుతున్న అతడిపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ నేపథ్యంలో జగ్గంపేట సర్కిల్ కార్యాలయంలో దుర్గాప్రసాద్ శుక్రవారం సరెండర్ అయ్యాడు. అతడిని సీఐ సూర్య అప్పారావు అరెస్టు చేశారు. నిందితుడు అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం బీబీ పట్నానికి చెందిన వాడని సీఐ తెలిపారు. ఇప్పటికే ఈ కేసులో లారీ డ్రైవర్ తంగయ్య, గంజాయి కొనుగోలు చేసిన ఎస్.గౌతమ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ వివరించారు.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కొవ్వూరు: పట్టణంలోని గోష్పాద క్షేత్రం వద్ద గోదావరి నదిలో గుర్తు తెలియని వ్యక్తి (50) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. మృతుడికి సంబంధించిన ఏవిధమైన ఆధారాలు లభ్యం కాలేదు. మృతదేహం స్థితిని బట్టి అతడు ఈ రోజే మరణించి ఉండవచ్చని పట్టణ పోలీసులు భావిస్తున్నారు. స్నానానికి నదిలోకి దిగి ప్రమాదవశాత్తూ మునిగి మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మృతదేహాన్ని పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ వెలికి తీయించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు కొవ్వూరు పట్టణ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

రత్నగిరిపై నేటి నుంచి వరుణ జపాలు

అన్నవరం: రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థిస్తూ సత్యదేవుని సన్నిధిలో ఐదు రోజుల పాటు వరుణ జపాలు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 7.30 గంటలకు దర్బారు మండపంలో స్వామివారి ఉత్సవమూర్తుల వద్ద పండితులు ఋష్యశృంగ మహర్షి విగ్రహానికి పూజలు చేసి జపాలు ప్రారంభిస్తారు. ఈ నెల 21 వరకూ ఈ కార్యక్రమాలు జరుగుతాయని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ శుక్రవారం తెలిపారు.

ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2023-24 సంవత్సరంలో మిగిలిన సీట్లను భర్తీ చేయనున్నట్టు కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకూ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరు కాని వారు సీటు పొందాలని తెలిపారు. మెరిట్ నంబర్ 1 నుంచి 583 వరకూ ఈ నెల 18వ తేదీ ఉదయం 8 గంటలకు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

17, 18 తేదీల్లో పలు రైళ్ల రద్దు

రాజమహేంద్రవరం సిటీ: విజయవాడ డివిజన్‌లోని అనకాపల్లి – తాడి సెక్షన్‌లో జరుగుతున్న పనుల దృష్ట్యా 17, 18 తేదీల్లో జిల్లా మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. ఆ రోజుల్లో గుంటూరు – విశాఖపట్నం – గుంటూరు (17239/17240), మచిలీపట్నం – విశాఖపట్నం – మచిలీపట్నం (17219/17220), 17వ తేదీన విశాఖపట్నం – విజయవాడ – విశాఖపట్నం (22701/22702) రైళ్లను రద్దు చేసినట్టు వివరించారు.

ప్రకృతి హితమైన సాంకేతికతను ఆవిష్కరించాలి

- చిన్న జీయర్ స్వామి
- 'యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్'పై జేఎన్‌టీయూకేలో సెమినార్



సెమినార్‌లో మాట్లాడుతున్న చినజీయర్ స్వామి. చిత్రంలో వీసీ ప్రసాదరాజు తదితరులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రపంచానికి ప్రకృతి హితమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించాలని జేఎన్‌టీయూకే విద్యార్థులకు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి పిలుపునిచ్చారు. 'యూనివర్సల్ హ్యూమన్ వాల్యూస్' అనే అంశంపై జేఎన్‌టీయూకే అలుమ్ని ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ, జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థి డాక్టర్ కేఐ వరప్రసాద్‌రెడ్డి సామాన్యులకు వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకువచ్చారని, ఇదే స్ఫూర్తితో విద్యార్థులు కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని హితవు పలికారు. ఎవరి స్థాయిలో వారు తనతో పాటు తన వారి కోసం వీలైనంత మంచి చేస్తే అది కుటుంబానికి, సమాజానికి, దేశానికే కాకుండా ప్రకృతిలోని సమస్త ప్రాణికోటికీ మేలు చేస్తుందని చెప్పారు. జేఎన్‌టీయూకే ప్రగతిని ప్రశంసించారు. విద్యార్థులను, అధ్యాపకులను ఆలోచింపజేసే రీతిలో పలు అంశాలను వివరించారు. ఓజోను పొరకు పడిన రంధ్రం జీవరాశులపై, సాంకేతికత ప్రభావం ప్రకృతిపై తక్కువగా ఉండేలా చేయడం వంటి అంశాలపై చర్చించి, ఉత్తేజపరిచారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న వర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ, స్వామీజీ చెప్పిన విషయాలను అందరూ ఆచరించి వృద్ధిలోకి రావాలని అన్నారు. డీఏపీ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎల్.సుమలత, రెక్టార్ కేవీ రమణ, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పి.కృష్ణారావు, జీయర్ వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలి

- అన్నవరం దేవస్థానం అధికారులకు చైర్మన్ రోహిత్ ఆదేశం
- ఈఓతో కలిసి పనుల పరిశీలన



శివసదన్ సత్రం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రోహిత్, ఈఓ అజాద్

అన్నవరం: వివిధ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసి, భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నవరం దేవస్థానం పాలక మండలి చైర్మన్ ఐవీ రోహిత్ ఇంజినీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. ఈఓ చంద్రశేఖర్ అజాద్‌తో కలసి వివిధ నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. తొలుత సత్యగిరి ఎంట్రన్స్ పక్క నుంచి నిర్మిస్తున్న పార్కింగ్ స్థలం రోడ్డు పనులను పరిశీలించారు. ఇవి పూర్తయితే సుమారు 200 కార్లను ఇక్కడ నిలిపే అవకాశం ఉంటుందని ఈఓ వివరించారు. అనంతరం సత్యగిరి నుంచి వాహనాలు దిగువకు వెళ్లేందుకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ రోడ్డును రెండో ఘాట్ రోడ్డుకు కలిపితే బాగుంటుందని చైర్మన్ సూచించారు. అలా కాకుండా గిరి ప్రదక్షిణ రోడ్డుకు కలిపితే ఆ రోడ్డు ద్వారా అసాంఘిక శక్తులు రత్నగిరికి చేరుకునే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. అటువంటి పరిస్థితి తలెత్తకుండా తగు భద్రత కల్పిస్తామని, అవసరమైతే టోల్‌గేట్ ఏర్పాటు చేస్తామని ఈఓ చెప్పారు. అలాగే, సత్యగిరిపై రూ.15 కోట్లతో నిర్మిస్తున్న 138 గదుల 'శివ సదన్ సత్రం' నిర్మాణ పనులను కూడా చైర్మన్, ఈఓ పరిశీలించారు. దీని నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సీఆర్ఓ కార్యాలయం పక్కన కేశఖండన శాల ఏర్పాటుకు చేపట్టిన స్థలం చదును పనులను పరిశీలించారు. సాయంత్రం గొల్లప్రోలు మండలం చెందుర్తిలో ఉన్న దేవస్థానం స్థలాన్ని కూడా చైర్మన్, ఈఓ పరిశీలించారు. ఈ స్థలంలో ఇటీవల పాతిన సరిహద్దు స్తంభాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఈ గుర్రాజు, ఇతర అధికారులు కూడా ఉన్నారు.